క్లుప్తంగా

27 మందికి ఉద్యోగాలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో కొలాబరా కంపెనీ ఆధ్వర్యాన శుక్రవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించగా... కళాశాల నుంచి 27 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.5లక్షల ప్యాకేజీ అందించబడుతుందని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, కొలాబరా సంస్థ ప్రతినిధి సోనుత్యాగి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వర్తక సంఘం అధ్యక్షుడు

కూసుమంచి: కూసుమంచి గ్రామానికి చెందిన వర్తక సంఘం అధ్యక్షుడు చొడవరపు కృష్ణారావు శనివారం టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం పాలేరుకు చెందిన రామసహాయం మాధవీరెడ్డి పాలేరు నుంచి టికెట్ ఆశించిన క్రమంలో పొంగులేటితో పాటు టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావులు కలిసి ఆమె ఇంట్లో భేటీ అయ్యారు. ఆమెతో చర్చించాక మాధవీరెడ్డి పొంగులేటికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

డీలర్‌పై విచారణ

నేలకొండపల్లి: గత వారం రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన ఓ డీలర్ పార్టీ చేరికలో పాల్గొని సస్పెండ్ అయ్యారు. అది మరువకముందే పైనంపల్లి డీలర్ ప్రచారంలో పాల్గొన్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. శనివారం మండలంలోని కోరట్లగూడెంకు చెందిన ప్రభుత్వ చౌకదుకాణం డీలర్ ఓ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొని నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ మేరకు పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి కె.జమలారెడ్డిని సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను అందించాలని ఆదేశించారు. ఈ మేరకు మండలంలో డీలర్‌పై విచారణ కొనసాగుతుంది.

బీఎస్పీ ఖమ్మం అభ్యర్థిగా 'అయితగాని'


అయితగాని శ్రీనివాస్‌గౌడ్

ఖమ్మం రాపర్తినగర్: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థిగా ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన అయితగాని శ్రీనివాస్‌గౌడ్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం ప్రకటించారు. కాగా, శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సిటీ కాలేజీలో బయో టెక్నాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. కొంతకాలం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసి, ఆ తర్వాత జర్నలిస్టుగా రెండు పత్రికలకు సంపాదకులుగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక సామాజిక పోరాటాలలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన 2014లో పాలేరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం బీఎస్పీలో చేరి గత ఏడాది కాలంగా బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు.

పౌష్టికాహారం అందించాలి


ఫుడ్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు, డైరెక్టర్

ఖమ్మం సహకారనగర్: చిన్నతనం నుంచే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రముఖ వైద్యులు కృష్ణ సుమంత్, యశ్మితలు, తెలంగాణ నారాయణ స్కూల్ డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖర్‌రావు, కొదుమూరు నాగపవన్‌లు పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో హెల్తీ ఫుడ్ ఫెస్ట్–2023 కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ చైతన్య సదస్సులు

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం మూడు న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించారు. జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు వారి హక్కులపై నిర్వహించిన సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎం.హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం.మరాజ్ శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టూడెంట్ లీగల్ లిటరసీ క్లబ్ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్లెమడుగు ప్రభుత్వ పాఠశాలలో సహాయ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ టి.శ్రీను బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. జాగృతి బాధ్యులు సత్యకుమార్, కొండల్‌రావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోరూరించే పానీపూరి..!

స్ట్రీట్ ఫుడ్ రారాజుగా పానీపూరి, గప్‌చుప్

- సాయంత్రం వేళల్లో అల్పాహారంగా తింటున్న యువత
- చిన్నా పెద్ద తేడా లేకుండా ఆకర్షించే ఫుడ్
- విక్రయాలతో లాభాలు గడిస్తున్న విక్రయదారులు
- కలుషిత పానీపూరీపై జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యనిపుణులు

సండే స్పెషల్



స్ట్రీట్‌ఫుడ్ రారాజుగా పేరుగాంచిన పానీపూరికి విపరీతమైన డిమాండ్ ఉంది. రోడ్ల పక్కన ఎక్కడబడితే అక్కడ చిన్నచిన్న తోపుడుబండ్లపై అమ్మే ఈ పానీపూరి చిన్నా,పెద్ద తేడా లేకుండా సాయంత్రం వేళల్లో ఎంతో ఇష్టంగా తింటుంటారు. దీని పేరు తలచుకుంటేనే నోరూరుతుండడంతో యువత దీనికోసం ఎగబడుతున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా దీన్ని పిలుస్తున్నా.. ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర పనులు చేసేవారు సాయంత్రం తమ పనులు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేక్రమంలో రహదార్ల వెంట విక్రయించే పానీపూరి, కట్‌లెట్ తినేందుకు ఇష్టపడుతున్నారు. ఆరోగ్య ప్రయోజనాలతో పాటు దీనికి ఇంత ఆదరణ ఉన్న పానీపూరిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..


గప్‌చుప్ బండి వద్ద కట్‌లెట్, పానీపూరీల ప్రియులు

ఖమ్మంగాంధీచౌక్: యువత ఎక్కువ ఆసక్తి కనబరిచే తినుబండారాలలో ఒకటైన పానీపూరిని ఒక్కోప్రాంతంలో ఒక్కో విధంగా పిలుస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో గప్‌చుప్, గోల్ గప్పా, కట్‌లెట్ అని పిలుస్తుంటారు. రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు మెండుగా ఉండడంతో సాయంత్రం పూట కాలేజీ నుంచి ఇంటికి వచ్చే యువత పానీపూరి బండ్ల వద్ద ఆగి తింటుంటారు.

పగలు తయారీ.. సాయంత్రం విక్రయాలు

పానీపూరి, కట్‌లెట్‌లను పగలంతా తయారు చేసి సాయంత్రం వేళల్లో ఎంచుకున్న అడ్డాల్లో చిరు వ్యాపారులు విక్రయిస్తుంటారు. గోధుమ పిండితో పాటు సగ్గు బియ్యం, బొంబాయిరవ్వలను కలిపి చిన్నగా, గుండ్రంగా తింటే కరకరలాడేలా తయారు చేస్తారు. అలాగే వీటికి ఉపయోగించే ద్రావణంలో చింతపండు, మిరపకాయలు, అల్లం, పుదీన, ఎల్లిపాయలు కలుపుతారు. విక్రయదారులు గుండటి పూరీలకు మధ్యలో రంధ్రం చేసి పానియంలో ముంచి అందిస్తారు. ఒకేసారి ఆ పానీ పూరీని తింటే ఆ మజానే వేరు. దీనికి కాంబినేషన్‌లో మరో వంటకం కట్‌లెట్. దీన్ని ఆలుగడ్డ, బఠానీతో తయారు చేసి గప్‌చుప్‌లతో పాటు అల్పాహారంగా విక్రయిస్తుంటారు. ఉదయం వేళ బఠానీ గింజలు, ఆలుగడ్డలను నానబెట్టి ఉడికించి సాయంత్రం వేళ ఓ పేనంపై వండుతూ దానిలో ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మకాయ, ఇతర మసాలా దినుసులను వేసి విక్రయిస్తుంటారు. కాగా, 5 గప్‌చుప్‌ల ధర రూ.10 వరకు ఉండగా, కట్‌లెట్ కప్పులను బట్టి రూ.10 నుంచి రూ. 20ల వరకు ఉంటుంది.

పలు పోషకాలతో తయారీ..

పానీపూరి, కట్‌లెట్‌లను పలు పోషకాలతో తయారు చేస్తారు. కాగా దీన్ని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలతో పాటు అతిగ తినడం వల్ల అనర్థాలు కూడా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిలో తక్కువ క్యాలరీలు ఉండడంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రయోజనకరంగా ఉంటుంది. వీటి తయారీలో ఉపయోగించే జీలకర్ర, పుదీనా, ధని యాల పొడితో నోటిపూత తగ్గుతుంది. ఇందులో వాడే మామిడి, ఎండు మిర్చి, నల్ల ఉప్పుతో అసిడిటీ నుంచి ఉపశమనం కలుగుతుంది. జీర్ణక్రియ మెరుగ్గా పనిచేయడంతో పాటు బరువు కూడా తగ్గుతారని, విక్రయదారులు పరిశుభ్రత పాటించకపోతే రోగాలను కొనితెచ్చుకున్నట్టేనని నిపుణులు సూచిస్తున్నారు.

అల్పాహారంగా తింటాం..



సాయంత్రం వేళా మంచి అల్పాహారంగా గప్‌చిప్, కట్‌లెట్ తింటా. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల సమయాన నా స్నేహితులతో కలిసి వచ్చి తింటుంటా. పగలంతా పనుల్లో బిజీగా ఉంటాం కాబట్టి రిలీఫ్ కోసం పానీపూరి బండ్ల వద్దకు వచ్చి వీటిని తింటే కొంత పసందుగా ఉంటుంది.
– తోట వీరభద్రం, గాంధీనగర్, ఖమ్మం

పానీపూరి టేస్టే వేరు..



కట్‌లెట్, పానీపూరిని చూస్తేనే నోరుతుంది. దాని టేస్టే వేరు. సాయంత్రం వేళ కట్‌లెట్‌ను తిన్న తర్వాత పానీపూరి తింటే మజాగా ఉంటుంది. సమయం దొరికినప్పుడల్లా ఇష్టమైన గప్‌చుప్ కోసం వెళ్లి తింటుంటాం. రుచికి రుచి, ఆహారానికి ఆహారంగా ఉంటుంది.
– టి రాజా, గాంధీచౌక్, త్రీటౌన్, ఖమ్మం

రుచి చూస్తే వదలరు..



ఒక్కసారి గప్‌చిప్, కట్‌లెట్ రుచి చూస్తే వదలరు. మా తాతల నుంచి ఇదే వ్యాపారం. నిత్యం రూ.2వేల పెట్టుబడితో పగలంతా తయారు చేసి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయిస్తా. ఉపాధి మేరకు నిత్యం రూ. 500ల నుంచి రూ. 600ల వరకు ఆదాయం వస్తుంది.
– వీరయ్య, విక్రయదారుడు, గాంధీచౌక్

మా కుటుంబం పేదల కోసం నిలబడింది..

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో తమ కుటుంబం మమత ఆస్పత్రిని స్థాపించి మమతను జనతాగా మార్చి లక్షలాది మంది పేద ప్రజల ఆరోగ్యం కోసం నిలబడిందని, ఈ విషయం జిల్లా ప్రజలకు తెలుసునని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం 53వ డివిజన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ఖమ్మంలో జరిగింది అభివృద్ధో.. అరాచకమో ప్రజల స్వీయ అనుభవంలో ఉన్నారని తెలిపారు. ఇక్కడ కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి ఉన్న అవగాహన 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న వాళ్లకు లేకపోవడం విచారకరం అన్నారు. బీఆర్ఎస్‌కు ఉన్న ఆదరణ చూసి తట్టుకోలేక విచక్షణ కోల్పోయి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మంలో బీఆర్ఎస్‌కు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, బొడెపుడి వీరయ్య బాబు, అవిరినేని శేషయ్య, ఆళ్ల సాంబశివరావు, పోట్ల శ్రీకాంత్, బత్తుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలం మంగ్యాతండా ఉప సర్పంచ్ సుశీల, 1, 6వ వార్డు సభ్యులు సరోజ, మంగమ్మ తదితరులు శనివారం కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. శివాయిగూడెం నుంచి గ్రామ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్ ఆధ్వర్యాన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరు నాయక్, రమేశ్, నాగేశ్వరరావు, సక్రు, రవి, ఈరు, రాజు, కిషన్ తదితరులు ఉన్నారు. అలాగే పువ్వాడ గెలుపును కాంక్షిస్తూ.. నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కుర్ర మాధవరావు, మెడబోయిన మల్లేశం, చిలుమూరి కోటి, ఎ.ప్రసాద్, ఎండీ ఫయాజ్, సత్యనారాయణరెడ్డి, కొచ్చర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

చింతగుర్తిలో పడిపూజ, హోమం..

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో వందలాది మంది అయ్యప్ప మాలభక్తులు, సర్పంచ్ మెంటం రామారావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడి పూజ, హోమం పూజలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కాగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజా అనంతరం స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు.

రెండో రోజు ఐదు నామినేషన్లు..

ఖమ్మంరూరల్/ఖమ్మంమయూరిసెంటర్: నామినేషన్ల ప్రక్రియ మొదలైన రెండో రోజు శనివారం మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయి. అందులో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి రెండు సెట్ల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరికి సమర్పించారు. 9వ తేదీన పొంగులేటి శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేయనున్నట్లు ప్రసాదరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఇండిపెండెంట్లుగా భైరవబొట్ల శ్రీనివాసరావు, షేక్.సిరాజుద్దీన్‌లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు వేశారు. ఖమ్మం నియోజకవర్గంలో తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపాదకుడు కె.గోపాలరావు రెండో సెట్ దాఖలు చేయగా.. స్వతంత్ర అభ్యర్థులు మారకపుడి శ్రీనివాసులు, కొంకిమల్ల సాయికుమార్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లను ఖమ్మం–112 ఆర్ఓ ఆదర్శ్ సురభికి అందజేశారు.

సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్‌కు కదలిరండి..

తిరుమలాయపాలెం: పాలేరు సీపీఎం అభ్యర్థి నామినేషన్‌కు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రూపు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను నాయకులు వెంకటేశ్, కొలిచలం స్వామి, పప్పుల ప్రసాద్, ఉపేందర్, రవి, చల్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం..


వనజీవి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ డాక్టర్ వనజీవి దంపతులను శనివారం రెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో దుర్గ నేతృత్వంలో పర్యావరణ ప్రేమికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. తిరుమల తిరుపతిలో జలవృక్షాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. తమ ప్రాంత వాసికి పద్మశ్రీ పురస్కారం వరకు ఎదిగిన క్రమాన్ని భావితరాలకు అందించే విధంగా త్వరలో కొన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టీటీడీ ఎస్వీబీసీ అడ్వయిజర్ అడపా దుర్గా, ఆర్‌సీ ఎగ్జామ్ సెంటర్ అధినేత మెండెం కిరణ్‌కుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీనటులు పుష్ప సురేశ్‌శర్మ, డోర్నకల్ నరేశ్, రాహుల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం


ఇస్లావత్‌తండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇస్లావత్‌తండాలో రహదారులు, సైడ్ డ్రెయిన్లు వేయిస్తానని, తెట్టెలపాడు సభలో దళితులందరికీ దళితబంధు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు పార్టీల నుంచి వచ్చిన వారిని పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంగీలాల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న ధనుంజయ్, గుంటి పుల్లయ్య, చిర్ర కృష్ణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం బోదులబండలో కందాళ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుమార్తె దీప్తి ప్రచారం చేశారు. ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్ అనగాని అనిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే పట్టం కట్టండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్

కామేపల్లి: రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్న బీఆర్ఎస్ పార్టీకి మూడోసారి పట్టం కట్టాలని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని.. వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. తన గెలుపులో కీలకపాత్ర పోషించిన కామేపల్లి తిరిగి అంతకంటే ఎక్కువ మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు, ఎంపీపీ బానోత్ సునీత, నాయకులు ఆంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, బొడ్డు కాంతమ్మ, మూడ్ రాధ, జాటోత్ జాయ్‌లూసీ, గుగులోత్ సునీత, రాయల చిన్న వెంకటేశ్వర్లు, యడ్లపల్లి శేషగిరి, యుగేందర్‌రెడ్డి, బానోత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పాటుపడేది కాంగ్రెస్సే..

ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల


ఖమ్మంవన్‌టౌన్: సమ్మేళనంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమామిళ్లగూడెం: కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారు వారి స్వలాభం కోసం కాకుండా ప్రజల కోసం ఎప్పుడూ పాటు పడతారని మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని 12వ డివిజన్ అపార్టమెంట్‌లో, ఏఎస్ఆర్ వృక్షం ఇన్‌ఫ్రా డెవలపర్స్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్, 58వ డివిజన్ దొరన్న కాలనీ వాసులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో తుమ్మల పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అవినీతి ప్రభుత్వాన్ని పారదోలేందుకు ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఖమ్మంను మరింత అభివృద్ధి చేసేందుకు ఖమ్మం చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డును వేయిస్తానన్నారు. తుమ్మల విజయాన్ని కాంక్షిస్తూ నగరంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యాన కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకాలపై శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బచ్చలపద్మాచారి, మస్తాన్, రాజేందర్, దాసరి శ్రీనివాస్, సాయి, ప్రణయ్, కామా ప్రభాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్స్ వాసులు దండారు ప్రసాద్, శివ, స్వర్ణ, నరసింహారావు, కూచిపూడి జయ, దిరిశాల హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, 5వ డివిజన్ కార్పొరేటర్ పల్లెబోయిన భారతి చంద్రం, మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్,సాధు రమేశ్‌రెడ్డి, శెట్టి రంగారావు, జంగం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దొరల పాలనను తరిమికొట్టాలి..

కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో గత తొమ్మిదిన్నరేళ్లుగా తెలంగాణలో కొనసాగుతున్న దొరల పాలనను తరిమికొట్టాలని కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సభల్లో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ రూ.5.50లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు స్థానిక ఎమ్మెల్యే, ఆయన తొత్తులు డబ్బు సంచులతో వస్తారని ఆ డబ్బులు మీవే కాబట్టి తీసుకొని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించని ఎమ్మెల్యే ఇప్పుడు ఏదో చేస్తానని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు...

మండలంలోని ఏదులాపురంకు చెందిన వెంపటి రవి ఆధ్వర్యంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి 150 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వల్లకుండ భుజంగరావు, వీరయ్య, నర్సింహారావు, గుండెపూడి భాస్కర్, జూశెట్టి విజయలక్ష్మి, మద్ది వీరారెడ్డి, కన్నేటి వెంకన్న, బైరు హరినాథబాబు, బోడా వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల గెలుపు నల్లేరు మీద నడకే..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గెలుపును ఎవరూ ఆపలేరని, సుమారు 50వేల ఓట్ల మెజార్టీతో గెలబోతున్నాడని కాంగ్రెస్ కార్పొరేటర్లు అన్నారు. శనివారం సాయంత్రం తుమ్మల క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, దొడ్డా నగేశ్, నాయకులు మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, పోట్ల వీరేందర్, చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, తుపాకుల యలగొండలస్వామి, సంపెట వెంకటేశ్వర్లు గౌడ్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార బీఆర్ఎస్ పార్టీ దొంగ ఓట్లు చేర్పించారని దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన తుపాకుల...

ఖమ్మం నగరంలోని 18వ డివిజన్‌కు చెందిన నాయకుడు తుపాకుల యలగొండలస్వామి శనివారం సాయంత్రం తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఆయనతో పాటు వైఎస్ఆర్‌టీపీ నాయకుడు సంపెట వెంకటేశ్వర్లు, 55వ డివిజన్ నుంచి గత కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ తరఫున కార్పొరేటర్‌గా పోటీచేసిన మోత్కూరి శ్రీనివాసరావులు కాంగ్రెస్‌లో చేరారు.

ఆరు గ్యారంటీలు కాంగ్రెస్‌కు బ్రహ్మాస్త్రాలు..


మాట్లాడుతున్న జెట్టి కుసుమకుమార్

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలు కాంగ్రెస్ గెలుపునకు బ్రహ్మాస్త్రాలు అని టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ జెట్టి కుసుమకుమార్ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ బొజ్జా సంధ్యారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రకటించిన ఐదు గ్యారెంటీలు ప్రమాణ స్వీకారం అమలుకు సంతకాలు చేశామని, అదే తరహాలో డిసెంబర్ 9వ తేదీన సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆరు గ్యారంటీల అమలుకు సంతకం చేయబడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పూర్తి చేసిన ప్రాజెక్టులకు బీఆర్ఎస్ రీడిజైనింగ్ పేరుతో రూ.వేల కోట్ల స్కాములు చేసిందని, జరిగిన ఈ అవినీతి మేడిగడ్డలో బయటపడిందని, అన్నారం, సుందిళ్ళ బరాజ్‌లు కూడా భవిష్యత్తులో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని కేంద్ర డ్యామ్ సేఫ్టీ అధికారులు హెచ్చరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోశ్, మిక్కిలినేని నరేందర్, చోటేబాబా, ఆనందరావు, మైనార్టీ నాయకులు రబ్బానీ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నేలకొండపల్లి: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో శనివారం వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నేలకొండపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కాంగ్రెస్‌లో చేరాడు. ఆయనతోపాటు 25 కుటుంబాలు చేరాయి. పైనంపల్లికి చెందిన 50 కుటుంబాలు, కోరట్లగూడెంకు చెందిన గుండా సురేశ్, ఊటుకూరి మధు ఆధ్వర్యాన 5 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి.

బీఆర్ఎస్‌తో ఒరిగిందేమీ లేదు

నేలకొండపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంతో నిరుద్యోగులు, విద్యార్థులకు ఒరిగింది శూన్యమని యూత్ కాంగ్రెస్ నాయకుడు అయ్యప్ప ఆరోపించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు ఆధ్వర్యాన కాంగ్రెస్‌లో చేరిన అనంతరం శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని తెలిపారు.

పొంగులేటి గెలుపునకు ప్రచారం..

తిరుమలాయపాలెం/కూసుమంచి: పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుటుంబసభ్యులు శనివారం మండలాల్లో విస్తృత ప్రచారం చేశారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, కూసుమంచి మండలం జీళ్లచెరువులో శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి ఇంటింటికి తిరుగుతూ పొంగులేటికి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, రామసహాయం నరేశ్‌రెడ్డి, కొప్పుల అశోక్, గూడూరు ఉపేందర్, గుండాల లింగయ్య, మోరపాక నాగయ్య, కొత్తపల్లి సరిత, నల్లగుట్ట ఎల్లయ్య, పాల్గొన్నారు.

9న ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న సయ్యద్ బాషా

ఖమ్మం మామిళ్లగూడెం : ఈనెల 9న ఖమ్మం ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా గల ఓ ఫంక్షన్ హాల్‌లో దూదేకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణా నూర్‌బాషా దూదేకుల, ముస్లిం మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనంలో అన్ని కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. దూదేకుల కులస్తులను బీసీ బీ నుంచి బీసీ ఈ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జానీబేగం, జిల్లా అధ్యక్షురాలు షకీనాబీ, నాయకులు రహీం, సైదులు, రహీంపాషా, రసూల్, మౌలానా, సైదా హుస్సైన్ రషీద్, మస్తాన్ సాహెబ్, దర్గా సాహెబ్, పందు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ నేషనల్ అవార్డు గ్రహీతకు ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: హైదరాబాద్‌లో ఆదివారం జరుగుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహాసభకు సంఘం రాష్ట్ర నాయకుడు, ఆస్ట్రాలజీలో ఇంటర్ నేషనల్ అవార్డు గ్రహీత పి.శ్రీనివాసచారికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి పెందోటి సోమేశ్వరాచారి శనివారం ఖమ్మంలోని జయనగర్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానం అందించారు. ఈ సభలో పాల్గొని విశ్వబ్రాహ్మణులు ఐక్యత చాటుకోవడంతో పాటు సంఘం ద్వారా సమస్యలు సాధించుకోవడంతో మీవంతు సహకారం అందించాలని కోరినట్లు సోమేశ్వరాచారి తెలిపారు. సభకు ఖమ్మం నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా తరలిపోతున్నామని, విజయవంతం చేయాలని పేర్కొన్నారు.